క్లుప్తంగా

నేడు ప్రార్థనా సదస్సు

కడప కల్చరల్ : నగరంలోని పాత బైపాస్ వద్ద గల కృష్ణా కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో ప్రార్థనా సదస్సును నిర్వహించనున్నట్లు దైవజనులు డాక్టర్ పి.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కొరియోగ్రఫీ, వాక్య సందేశం అందజేయనున్నారు. లోక సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. విశ్వాసులు హాజరు కావాలని కోరారు.

తాలూకా ఎస్ఐగా తులసి నాగప్రసాద్



కడప అర్బన్ : కడప నగరం తాలూకా ఎస్ఐగా తులసి నాగప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. సింహాద్రిపురం ఎస్ఐగా ఉన్న ఆయనను తాలూకా ఎస్ఐగా బదిలీ చేశారు. కాగా ఈయన గతంలో జిల్లాలోని చెన్నూరు, కమలాపురం, కడప 2టౌన్, చిన్నచౌక్, సిద్దవటం, రాజుపాలెంలో పనిచేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనను స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా హబీబుల్లా



కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్‌రోడ్డులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా హబీబుల్లా బాధ్యతలు స్వీకరించారు. ఈ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న నూర్జాహాన్ ఇటీవల పదవీ విరమణ చేశారు. దీంతో ఆమె స్థానంలో హబీబుల్లాకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ ఏప్రిల్ 7వ తేదీ నుంచి మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా భోజనం, పుస్తకాలతోపాటు ఉచిత విద్యనందిస్తుందన్నారు.

శిల్పారామంలో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవ వైభవం



శిల్పారామం ప్రధాన వేదికను పరిశీలిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : కడప శిల్పారామం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సాంస్కృతిక వైభవానికి వేదిక కానుంది. సోమవారం నుంచి ఈనెల 10వ తేది వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు శిల్పారామం ప్రధాన వేదికపై ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ డిల్లీరెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం సాంస్కృతిక వేదికను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మహానాడు'కు స్థల పరిశీలన



మహానాడు నిర్వహణకు స్థలాలను పరిశీలిస్తున్న మంత్రులు

కడప రూరల్: తెలుగుదేశం పార్టీ కడపలో మే నెలలో నిర్వహిస్తున్న మహానాడు నిర్వహణకు సోమవారం మంత్రులు స్థలాలను పరిశీలించారు. ఎన్జీఓ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన స్థలాల పరిసరాలతో పాటు, జయరాజ్ గార్డెన్, శాటిలైట్ సిటీ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కడపలో మహానాడును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే నెలలో 27, 28న ప్లీనరీ, 29వ తేదీన బహిరంగ సభ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత, మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు కాల్వ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆర్టీసీ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : రాష్ట్ర రవాణా యువజన సర్వీసులు, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సోమవారం ఆర్టీసీ అతిథి గృహంలో అధికారులు కలిశారు. డాక్టర్ వైఎస్సార్ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, విజిలెన్స్ ఆర్టీసీ అధికారి ముజుబుర్ రెహ్మాన్‌లు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు.

వైభవంగా రామయ్య రథోత్సవం



రథాన్ని లాగుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో మహిళా భక్తుల కోలాట ప్రదర్శన

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం వసంత నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రాత్రి సీతారాముల ఉత్సవ మూర్తులకు కనుల పండువగా అలంకారం చేసి రథంపై కొలువుదీర్చారు. భక్తులు జై శ్రీరామ్ నినాదాలు చేస్తుండగా రథం తొలుత మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చింది. అనంతరం హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రధాన వీధులు, ఎర్రముక్కపల్లె మీదుగా అర్ధరాత్రి అనంతరం తిరిగి ఆలయాన్ని చేరింది. తమ ఇళ్ల ముంగిటనే విచ్చేసిన సీతారాములను దర్శించుకున్న భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పాల్గొన్న మంత్రి మండిపల్లి

రామయ్య రథోత్సవంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన సహచరులతో కలిసి ఆలయంలోని శ్రీ సీతారాముల మూలమూర్తులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేశు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆయన రథం వద్దకు చేరుకుని గుమ్మడికాయ హారతులు ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు ఆయనను గజమాలతో సత్కరించారు.

ఒంటిమిట్టలో 'కట్టా'ను విస్మరించడం తగదు

– ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్‌లోనే ఒంటిమిట్ట అతి ప్రాచీన దేవాలయమని ఆధారాలతోసహా నిరూపించిన ఒంటిమిట్ట కొత్తపల్లె గ్రామ వాసి, బ్రౌన్ గ్రంథాలయం పూర్వ బాధ్యులు విద్వాన్ కట్టా నరసింహులును ప్రభుత్వం విస్మరించిందని ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. ఒంటిమిట్టలో అధికారికంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ప్రధానపాత్ర పోషించిన విద్వాన్ కట్టాను ఈ సమయంలో మరువడం బాధాకరమన్నారు. ఒంటిమిట్టకు అత్యంత సమీపంలోని కొత్తపల్లె కట్టా స్వగ్రామమని, ఆలయంతో ఆయనకు ఎనలేని అనుబంధం ఉందని, పోతన సాహిత్యపీఠం బాధ్యునిగా సాహిత్య సేవలు చేశారని, ఉద్యోగ విరమణ అనంతరం తిరుమల–తిరుపతి దేవస్థానాల భాగవతా ప్రాజెక్టులో సేవలు అందించారని గుర్తు చేశారు. ఒంటిమిట్టలో ఆయన స్మారకాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.

ఊరి బడిని దూరం చేయవద్దు

కడప ఎడ్యుకేషన్: ఊరి బడిని దూరం చేయవద్దని, ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడడానికి ప్రభుత్వం చొరవ చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం సాయంత్రం ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కడపలోని రాష్ట్ర అతిథి గృహంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విలీన ప్రక్రియతో ముందుకు వెళితే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే పాఠశాలల విలీన ప్రక్రియను ఆపి వేసి ప్రజా ఆమోదయోగ్యమైన నిర్ణయాలను అమలుపరచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కరిముల్లా గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా ఉత్సవంలో వైవీయూ విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: రాజమండ్రిలో ఇటీవల జరిగిన అమరావతి చిత్రకళా ఉత్సవంలో యోగి వేమన విశ్వవిద్యాలయం, లలిత కళా విభాగం విద్యార్థులు ప్రదర్శించిన చిత్రాలు వీక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. వైవీయు విద్యార్థుల పెయింటింగ్స్‌ను సందర్శకులు మెచ్చుకొని కొనుగోలు చేశారు. ప్రతిభ చూపిన వైవీయూ బీఎఫ్ఏ విద్యార్థి ముత్యంకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టూరిజం సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ శాలువా కప్పి అభినందించారు. విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దాదాపు రెండు వందల చిత్రాలను ప్రదర్శించారు. లలితకళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, అధ్యాపకులు సి.హెచ్. వెంకటేశ్ , బి ఈరప్ప ప్రదర్శనలో మార్గదర్శకం వహించారు. అలాగే ఈనెల 5వ తేదీ విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ , డ్రీం ఆర్ట్ గ్యాలరీ సంయుక్తం గా × పర్యావరణ పరిరక్షణ పై నిర్వహించిన పెయింటింగ్ వర్క్‌షాప్‌లో విద్యార్థులు దండు మేను ముత్యం , ఆర్ . పునీత్‌లు పాల్గొని ప్రతిభ చూపారు.

ఆరోగ్యకర జీవనశైలితో మెరుగైన జీవితం

చింతకొమ్మదిన్నె : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రాఘవేంద్ర మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రారంభం –ఆశాజనక భవిష్యత్ అనే థీమ్‌తో 2025 సంవత్సరంలో అందరూ ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని, సరైన వయసులో వివాహం –సంతోషానికి నిలయం, పోష్టికాహారం తల్లిబిడ్డ ఆరోగ్యానికి సోపానమని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినులు, ప్రజలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పోరుమామిళ్ల: మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రొద్దుటూరు డివిజన్ ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో లెక్కించారు. కార్యక్రమాన్ని ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పోలీసులు, అర్చకులు, గ్రామపెద్దలు పర్యవేక్షించారు. హుండీలో 5 నెలలకు రూ. 9,07,988 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసయ్య తెలిపారు. డబ్బును బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు.

కడప బిషప్ పట్టాభిషేకానికి తరలిరండి



మాట్లాడుతున్న కడప మేత్రాసన వికార్ జనరల్ మోన్సిగ్నోర్ తలారి బాలరాజు

కడప కల్చరల్ : కడప బిషప్‌గా నియమితులైన మోస్ట్ రెవరెండ్, కడప మేత్రాసన పీఠాధిపతి సగినాల పాల్ ప్రకాశ్ పట్టాభిషేకానికి విశ్వాసులంతా తరలి రావాలని కడప మేత్రాసన వికార్ జనరల్ మోన్సిగ్నోర్ తలారి బాలరాజు, కోశాధికారి ఫాదర్ సంబటూరు సురేష్‌లు కోరారు. సోమవారం కడప మరియాపురంలోని బిషప్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 9న బిషప్ పట్టాభిషేక మహోత్సవం మరియాపురం హైస్కూలు మైదానంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విరివిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు. కడప దయాసిస్‌కు నూతన కాపరిగా సగినాల పాల్ ప్రకాష్ నియమితులయ్యారని తెలిపారు. కార్యక్రమానికి వాటికన్ నుండి పోప్ దూత లియోపోల్డ్ జిరెల్లి ముఖ్య అతిథిగా, ప్రధాన అభిషేక పీఠాధిపత్తులుగా హైదరాబాద్ మేత్రాసనానికి చెందిన కార్డినల్ పూల అంతోని, సహాయ అభిషేక పీఠాధిపతులుగా బిషప్ డాక్టర్ గాలి బాలి, నెల్లూరు బిషప్ డాక్టర్ మోషేష్ డి ప్రకాశంలు పాల్గొంటారని తెలిపారు. ముఖ్య ప్రసంగీకులుగా విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు డాక్టర్ జోసఫ్ రాజారావు హాజరవుతారన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు నుండి దాదాపు 20 మంది బిషప్‌లు కూడా పాల్గొంటున్నారని తెలియ జేశారు. 9వ తేది ఉదయం 9 గంటలకు ఊరేగింపుగా బయలు దేరి 10 గంటలకు దివ్యబలిపూజ, నూతన పీఠాధిపతుల అభిషేకం ప్రతిష్ట ఉంటుందన్నారు. ఈ సమావేశంలో తిరుపతి విచారణ గురువు ఫాదర్ ఆనంద్, ఎర్రగుంట్ల విచారణ గురువు ఫాదర్ ఇట్టా మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించలేరా?



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నాడు ఆంధ్రప్రదేశ్లో పేదలకు వైద్యం అందుబాటులో లేని స్థితిలోకి వచ్చిందని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుండా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద సేవలు కొనసాగించలేమని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ స్పష్టం చేసిందన్నారు. రూ.3500 కోట్లు కట్టలేని స్థితిలో ఆంధ్రప్రదేశ్ ఉందంటే సిగ్గుచేటు అన్నారు. నెల రోజులు సమయం ఇచ్చినా కూడా దానిమీద ఎటువంటి చర్య తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా తక్షణమే రూ.3500 కోట్లు విడుదల చేయాలని, పేదల ఆరోగ్యం కాపాడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

ఈ సమావేశంలో జమ్మలమడుగు అసెంబ్లీ సమన్వయకర్త సింగం శివ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, సయ్యద్ గౌస్ పీర్, కదిరి ప్రసాద్ గౌడ్, రఫీఖ్ ఖాన్, మామిళ్ళ నరసింహులు, మామిళ్ళ బాబు, పాలగిరి శివ, శ్యామలమ్మ హరిప్రసాద్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

పేదల వైద్యానికి పెద్ద కష్టం





కడప నగరంలో వైఎస్ఆర్ హయాంలో ఏర్పాటు చేసిన రిమ్స్ ఆసుపత్రికి జిల్లా నలుమూలల నుంచి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. కాగా ఈ మధ్య 108 అంబులెన్స్‌లు సరిగా అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గత్యంతరం లేక వ్యయప్రయాసలకు ఓర్చి ప్రైవేటు వాహనాలలో రావాల్సి వస్తోంది. ఈ చిత్రం అందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. పులివెందుల నియోజక వర్గం చక్రాయపేటకు చెందిన మహబూబ్ సాబ్ (70) అనే వృద్ధుడు అనారోగ్యం బారిన పడ్డాడు. ఆయన కుటుంబీకులు 108కు ఫోన్ చేయగా అందుబాటులో లేక పోవడంతో బాడుగ వాహనంలో రిమ్స్‌కు వచ్చి ఎమర్జెన్సీ వార్డులో చేరారు. ఈ వైద్యం కష్టాలు తీర్చాలని పేదలు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ , కడప

వానరం ఆకలి తీరింది





కడప నగర శివార్లలోకి సోమవారం ఓ వానరం వచ్చింది. ఎండ వేడిమికి దానికి బాగా ఆకలి వేసింది. ఆహారం కోసం అటూ ఇటూ తిరుగుతూ జేఎంజే కళాశాల సమీపంలోని ఓ హోటల్ వద్దకు చేరింది. అక్కడ ఓ డస్ట్‌బిన్ కనబడింది. అందులో ఏమైనా తినేందుకు ఉన్నాయా అని వెతికింది. అయితే అందులో ఏమీ లేవు. ఆ వానరం పడుతున్న ఆకలి బాధను హోటల్ నడుపుతున్న ఓ అవ్వ చూసింది. వెంటనే హోటల్‌లో ఉన్న రెండు దోసెలను ఆ కోతికి అందించింది. ఆ వానరం ఆ దోసెలను అందుకుని ఆరగించింది.

– కడప అర్బన్

నర్సరీ ఏర్పాటుకు విత్తనాల సేకరణ



సిద్దవటం రేంజ్‌లోని గొల్లపల్లె బీటు అటవీ ప్రాంతంతో విత్తనాలను సేకరిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

సిద్దవటం : నోడల్ నర్సరీ ఏర్పాటుకు సిద్దవటం రేంజ్ గొల్లపల్లె బీటులో అటవీ ప్రాంతంలో విత్తనాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మార్చి 21వ తేదీన అంతర్జాతీయ అటవీశాఖ దినోత్సవం రోజు కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ కడప ప్రాంత ఫారెస్టు రెస్టోరేషన్ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. అందులో భాగంగా డీఎఫ్ఓ ఆదేశాల మేరకు నోడల్ నర్సరీని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో సిద్దవటం రేంజ్‌లోని స్థానిక జాతి మొక్కలైన రేవా, ఎర్రచందనం, వెలమ, ముష్టి, కరక్కాయలు, అరె, సార, అడవి తమ్మ, ఒడిసే, కుంకుడు కాయలు, కొండపల్లె బొమ్మలకు ఉపయోగించే తెల్లపొనికి, నీరుద్ది, మునుకుడు, మారెడు, ఎర్రబిక్కి, దినసరప, సండ్ర, నులితడ, గొటిక వంటి చెట్లకు సంబంధించి విత్తనాలను సేకరిస్తున్నామన్నారు. వీటి విత్తనాలతో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలతో అటవీలో పచ్చదనాన్ని పెంచడానికి ఉపయోగిస్తామన్నారు. అలాగే ప్రజలకు పంపిణీ చేస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఓబులేస్, ఎఫ్‌బీఓలు విశ్వనాథ్, మరికొందరు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు వేతనాలు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలను 12 నెలలకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. సోమవారం ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకట పతికి వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు టీచర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద భారీగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు ఉపాధ్యాయులకు మాత్రం 10 నెలల వేతనమే ఇస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల ర్యాంకులు, అడ్మిషన్లలో సిబ్బందే కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కనీసం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థలు ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి అడ్మిషన్లు చేయిస్తేనే వచ్చేసంవత్సరం ఉద్యోగం ఉంటుందని, లేకుంటే ఉండదని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , సయ్యద్ ముష్తాఖ్ హుసేన్ ,రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అబ్దుల్ మునాఫ్‌లు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ 2001 సంవత్సరంలో సీఎం చంద్రబాబు నాయుడు ఉర్దూ భాషాభివృద్ధి కోసం రోష్ని స్కీం ప్రారంభించారని, ఆ స్కీం ద్వారా 300 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించి, ప్రతి పాఠశాలకు రెండు ఉర్దూ ఎస్జీటీ పోస్టులు మంజూరు చేశారన్నారు. రోష్ని స్కీం పునఃప్రారంభించి ముస్లిం మైనారిటీ ఏరియాలలో కనీసం 500 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు ప్రతి పాఠశాలకు రెండు ఉర్దూ ఎస్జిటి పోస్టులతో సహా ప్రారంభించాలని వారు కోరారు. 2025లో స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించాలన్నారు.

ఘన సన్మానం



చిన్నపరెడ్డిని సత్కరిస్తున్న చర్చి ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరంలోని జీసెస్ బ్లెస్సింగ్స్ చర్చి ఆవరణలో ఇటీవల ఇంటాక్ జాతీయ స్థాయి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా గెలుపొందిన ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డికి సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ కిషోర్‌తో పాటు చర్చి సభ్యులు, పెద్దలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఇందుకు చిన్నపరెడ్డి స్పందిస్తూ జిల్లాలో పురాతన కట్టడాల పరిరక్షణకు, పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సీనియర్ సభ్యులు లయన్ సంజీవరెడ్డి, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి



ద్విచక్ర వాహనదారుడికి కరపత్రాలను అందిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష

కడప ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఇలియాస్‌బాష అన్నారు. ఏప్రిల్ 7వ తేదీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా రాయల్ రషీద్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అబ్దుల్ రాయల్ కరిముల్లా ఆధ్వర్యంలో ఇలియాస్ బాష చేతుల మీదుగా ద్విచక్ర వాహన దారులకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగితే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాజిత్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలియజేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.